

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

పారదర్శకంగా రేషన్ కార్డుల సర్వే

● కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బోరబండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల మంజూరు కోసం నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా ఉండాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులకు సూచించారు. హబీబాఫాతిమానగర్ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్డుల జారీ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న ప్రభుత్వం నాలుగు కొత్త పథకాలను ప్రారంభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ బాల్‌రాజ్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జిగోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 22, ఓబుల్ రెడ్డి స్కూల్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1, రోడ్ నంబర్ 13 కలెక్టర్ బంగ్లా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.15 వరకు 11కేవీ గాయత్రి హిల్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 11.30 గంటల నుంచి 11.50 వరకు 11కేవీ యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36, మినిస్టర్ క్వార్టర్స్, రోడ్ నంబర్ 10 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.45 వరకు 11కేవీ బంగారు మైసమ్మ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 11కేవీ ఐటీఏ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

మెడికల్ అధికారి నియామకానికి

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగడ్డ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ చెస్ట్ ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ అధికారిని నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 లోపు దరఖాస్తులు అందించాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.72 వేల గౌరవ వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వెల్లడించారు.

ఇల్లు నిర్మించుకుంటుంటే వేధిస్తున్నారని ఫిర్యాదు

బంజారాహిల్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాల అనుమతులు, సరైన పత్రాలు కలిగి ఉండి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు పనులు చేస్తుంటే కొందరు వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ వ్యక్తి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 5లో మహమ్మద్ షాకీర్ అనే ఎన్నారైకి షేక్‌పేట మండలం సర్వే నంబర్ 391(న్యూ)లో 1222 గజాల స్థలం ఉంది. ఈ స్థలంలో రెండు గదులు నిర్మించి చాలా ఏళ్లుగా తన బంధువైన తాహెర్ అలీని కేర్ టేకర్‌గా ఉంచాడు. గత ఏడాది జూలైలో జీహెచ్‌ఎంసీ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకుని ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ స్థలం తనదంటూ గత కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తాహెర్ అలీ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంలో తమకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని ఫిర్యాదులో వెల్లడించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



జేఎస్‌టీ సాయిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర్‌రావు

జేఎస్‌టీ సాయికి

తుర్లపాటి కుటుంబరావు స్మారక అవార్డు

అమీర్‌పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ మోడల్ కాలనీ ఉపాధ్యక్షుడు, జీహెచ్‌ఎంసీ ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ సాయికి ప్రముఖ సీనియర్ పాత్రికేయులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత తుర్లపాటి కుటుంబరావు స్మారక అవార్డును ప్రదానం చేశారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కృష్ణ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితి సమితుల ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జేఎస్‌టీ సాయి పురస్కారాన్ని అందుకున్నారు. సామాజిక కార్యకర్తగా, మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శిగా, ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడిగా సాయి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల దృష్ట్యా ఆయనకు ఈ అవార్డు అందజేశారు. టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర్‌రావు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన్ను మోడల్ కాలనీలోని పలువురు అభినందించారు.



క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్ తదితరులు

ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ఓయూలోని హెచ్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ కుమార్ తెలిపారు. క్రికెట్ టోర్నీ వాల్‌పోస్టర్‌ను ఆదివారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిషోర్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగారం ప్రశాంత్ మాట్లాడుతూ.. వచ్చే నెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు నిర్వహించే క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 29 వరకు 9848178925, 9346714365 ఫోన్ నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మొదటి బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, నాగయ్య, పవన్, మిథున్ ప్రసాద్, కొండ రామకృష్ణ, శ్రీకాంత్, వడ్డెపల్లి సందీప్, సాయి, అనిల్, నవీన్, శివ, ప్రేమ్ పాల్గొన్నారు.

కొత్త కార్డులొస్తున్నాయ్

● నేటితో పూర్తి కానున్న లబ్ధిదారుల గుర్తింపు సర్వే
● ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల జారీ
● ఆ తర్వాతే పాతకార్డుల్లో మార్పుచేర్పులకు అవకాశం



రేషన్ కార్డుల సర్వేలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఖైరతాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి అధికారులు శుభవార్త అందించారు. అర్హులకు ఆహార భద్రత కార్డులు మంజూరు చేసేందుకు నిర్వహిస్తున్న సర్వే ఈ నెల 20లోపు పూర్తి కానుంది. 21 నుంచి 24 వరకు అర్హుల జాబితాలను విడుదల చేసి బస్తీ సభల్లో లబ్ధిదారులకు కార్డులు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

జంట సర్కిళ్లలో చివరి దశకు సర్వే ప్రక్రియ

పౌరసరఫరాల శాఖ సర్కిల్ 7 పరిధిలో మొత్తం 6,093 మందికి రేషన్ కార్డులు లేనట్లు అధికారులు గుర్తించారు. ఇటీవలే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే నిర్వహించింది. అందులో సేకరించిన సమాచారం మేరకు రేషన్‌కార్డులు లేనివారి జాబితాను రూపొందించారు.ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్(17)లో 1,960 మంది, జూబ్లీహిల్స్ సర్కిల్(18)లో 1,661 మందిని గుర్తించారు. ఈ నెల 20 లోపు సర్వేను పూర్తిచేసి కార్డులు లేని కుటుంబాల్లో అర్హులను గుర్తించాలని ప్రతి వార్డుకు మూడు బృందాలను నియమించారు. కాగా, ఇప్పటికే ఈ రెండు సర్కిళ్లలో దాదాపు సర్వే పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు చెందిన బృందం గుర్తించిన లబ్ధిదారుల జాబితాను బస్తీ సభల్లో ప్రదర్శించి ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే 26వ తేదీ నుంచి ఆహార భద్రత కార్డులను జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.



నిరంతర ప్రక్రియగా కార్డుల జారీ

రేషన్ కార్డుల కోసం డిమాండ్ భారీగా ఉన్నప్పటికీ ప్రస్తుతం కులగణన సర్వేలో కార్డులు లేవని చెప్పిన వారికి మాత్రమే కొత్త కార్డుల కోసం విచారణ జరుగుతోంది. అందులో సైతం ఫిల్టర్ చేసిన తర్వాత గుర్తించిన వారినే సర్వే చేస్తున్నారు. అయితే తాము కూడా అర్హులమేనని, తమపేర్లు ప్రస్తుత జాబితాలో లేవని చాలామంది జీహెచ్‌ఎంసీతో పాటు పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా జరుగుతుందని, ప్రస్తుత జాబితాను విచారించి కొత్త కార్డులు ఇచ్చిన అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే మిగతా వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని సర్కిల్ 7 సహాయ పంపిణీ అధికారిణి బి.జ్యోతి తెలిపారు. దీంతో పాటు పాత కార్డుల్లో కొత్త పేర్లు చేర్చేందుకు, చిరునామా మార్పు, చనిపోయినవారి పేర్ల తొలగింపు ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు.

కొత్త కార్డుల జారీ తర్వాతే మార్పుచేర్పులు

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు ఆహార భద్రత కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో కార్డులకు డిమాండ్ పెరిగింది. దీంతో పాటు ఆరేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డుల జారీని నిలిపివేయడంతో కార్డులు లేని కుటుంబాలు చాలానే ఉన్నాయి. అడ్రస్ మారినవారు, కొత్తగా పేర్లను చేర్చాల్సిన వారు సైతం ఎంతోకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మొదట సర్వే ఆధారంగా కార్డులు లేని వారికి కొత్తవి మంజూరు చేయనున్నారు. అనంతరం మార్పులు, చేర్పుల ప్రక్రియను చేపడతామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. సర్కిల్ 7 సివిల్ సప్లై కార్యాలయ వివరాల ప్రకారం ప్రస్తుతం 83,013 ఆహార భద్రత కార్డులు ఉండగా, అందులో తెలుపు రంగు రేషన్ కార్డులు 79,531, అంత్యోదయ కార్డులు 3,481, అన్నపూర్ణ కార్డులు 1 ఉన్నాయి.

అధికారం ఉన్నా.. లేకున్నా.. ప్రజల్లోనే ఉంటా

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని డీఎస్‌ఎం కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా తమ కాలనీలోని రోడ్లపై తెల్లవారుజాము వరకు ఆకతాయిలు తిష్ట వేస్తున్నారని, బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన తలసాని రాత్రి వేళల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులును ఆదేశించారు. కాలనీలో ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ లైన్‌ను తొలగించాలని, విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న వైర్లను తొలగించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. మసీద్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో ఘనసీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. 2014కు ముందు సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ ఫ్లైఓవర్ విస్తరణ, ఇండస్ట్రియల్ పార్క్ నుంచి బాలానగర్ వరకు అండర్‌పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయట్లేదని విమర్శించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, జీహెచ్‌ఎంసీ డీఈ వాసుదేవరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఏఈ శేఖర్, ఏఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సహాయకుడి తండ్రికి పరామర్శ

తన వ్యక్తిగత సహాయకుడు వెల్లంకి హరీష్ తండ్రి సుదర్శన్‌రావు ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీకేగూడలోని వారి నివాసానికి పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

సంఘ్ కార్యకర్తలు

సమాజంలో మార్పు తీసుకురావాలి

ఖైరతాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంఘ్ కార్యకర్తలు తమ ప్రవర్తనతో సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ బాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ పొన్నపల్లి రామకృష్ణ సూచించారు. ఆదివారం ఖైరతాబాద్ వెంకటరమణ కాలనీలోని సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్ శాఖ 62వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆవులప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లలో సాధించిన విజయాలను రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ అన్నదానం రామసుబ్రహ్మణ్యం, గోల్కొండ భాగ్ సహ కార్యవాహ విజయ్, ఖైరతాబాద్ నగర్ సహ కార్యవాహ కనకయ్య, శాఖ కార్యవాహ రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

'వేల గొంతులు.. లక్ష డప్పులు'కు తరలిరావాలి

● అధ్యాపకులకు మంద కృష్ణమాదిగ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకై ఫిబ్రవరి 7న తలపెట్టిన మాదిగ జాతి అంతిమ పోరాటంలో అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సూచించారు. ఎస్సీ వర్గీకరణ చేసి, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఓయూలోని ఈసీఈ ఆడిటోరియంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందకృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాదిగ అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదని ఆయన హితవు పలికారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేల గొంతులు.. లక్ష డప్పులు' సాంస్కృతిక సమరానికి అధ్యాపకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న, నర్సింహ, చేబర్తి యాదగిరి, శ్రీపతి నర్సయ్య, చింత జాన్ విల్సన్, గట్టు మల్లయ్య, ఇస్మాయేల్, కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

హౌసింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

ఎర్రగడ్డ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తవుతున్నదని, సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సొసైటీ సభ్యుడు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీహాల్లో క్విజ్, పజిల్, లక్కీ డిప్ తదితర పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ స్థానికులకు అవసరమైన ఒక పార్క్ గానీ, ఆటస్థలం గానీ, దేవాలయం గానీ లేకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, సొసైటీ సభ్యులు ముందుకువచ్చి ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు, కాలనీవాసులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, సీహెచ్ హనుమంతరావు, బి.నాగేశ్వరరావు, శేషగిరిరావు, కేహెచ్ఎస్ శర్మ, రమేష్ పాల్గొన్నారు.

బార్ లైసెన్స్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

రాయదుర్గం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెద్దలు, అధికారులతో పరిచయాలు ఉన్నాయని రాయదుర్గం, మాదాపూర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో బార్‌లకు లైసెన్స్‌లు ఇప్పిస్తానని పలువురుని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన పవన్(25) బీ ఫార్మసీ చేశాడు. నగరానికి వచ్చి మోసాలకు అలవాటుపడిన అతడు తన స్నేహితుడి ద్వారా ఓ రెస్టారెంట్‌లో పరిచయమైన నలుగురిని బార్‌లకు లైసెన్సులు ఇప్పిస్తానని నమ్మించాడు. గత ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు గచ్చిబౌలిలో నివాసం ఉండే నాగార్జున నుంచి రూ.45 లక్షలు, మాదాపూర్ అయ్యప్ప సొసైటీకి చెందిన ధర్మారెడ్డి నుంచి రూ.29 లక్షలు, మరో ఇద్దరి నుంచి రూ.11 లక్షలు వసూలు చేశాడు. మూడు నెలల అనంతరం మోసపోయామని తెలియడంతో రాయదుర్గం, కూకట్‌పల్లి, మాదాపూర్ పోలీసుస్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలం బ్యాక్‌వాటర్ తరలింపును అడ్డుకోవాలి

● ప్రభుత్వాన్ని కోరిన సామాజికవేత్త కె.అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త అశోక్ కుమార్

పంజాగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు ముఖ్య నీటి వనరు అయిన శ్రీశైలం జలాలను అక్రమంగా తరలించుకుపోతుంటే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదని నగరానికి చెందిన సామాజికవేత్త కె.అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఏర్పాటు చేసిన ఓ సంస్థ అనధికారికంగా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను తరలించకుపోతున్నట్లు తమ క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించామన్నారు. సదరు సంస్థ సూర్యరశ్మి లేనిసమయంలో నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకే భారీ కాలువలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున నీటిని తరలించుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. జలాలను అక్రమంగా తరలించుకుపోతుంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. ఇలా నీటి తరలింపుతో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శ్రీశైలం బ్యాక్‌వాటర్ తరలింపును అడ్డుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్ రెడ్డి, సైదారావు పాల్గొన్నారు.

బీసీలకు 56శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్
● 28న విజయవాడలో నిర్వహించే బీసీ సంఘాల సమావేశం పోస్టర్ ఆవిష్కరణ
● విజయవంతం చేయాలని బీసీలకు పిలుపు

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ పార్టీలకతీతంగా డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 28న విజయవాడలో నిర్వహించనున్న ఏపీ బీసీ కుల సంఘాల సమావేశ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, క్రిమిలేయర్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా బీసీలకు రాజ్యాంగ ఫలాలు పూర్తిస్థాయిలో దక్కకపోవడం శోచనీయమన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు భరత్‌కుమార్, రాజేందర్, వేముల రామకృష్ణ, నీలం వెంకటేష్, రామకోటి ముదిరాజ్, బలరాం, భాస్కర్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఈస్ట్ మారేడుపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడులపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ పరిధిలోని కాలనీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లిలో ఎమ్మెల్యే పర్యటించి కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈస్ట్ మారేడుపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి కాలనీలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా స్థానిక పార్క్‌లో మరిన్ని వసతులు కల్పించాలని, టీచర్స్ కాలనీలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. టీచర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్యపై జలమండలి అధికారులతో పలుమార్లు చర్చించామని, సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ సి.సంతోష్ యాదవ్, వేణు గోపాలాచారి, మహేష్, శివ, ఈస్ట్ మారేడుపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన సౌందర్య తదితరులు

బీజేపీ పటిష్టతకు కృషి చేస్తా..

● పార్టీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య

అడ్డగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలిగా నియమితులైన సౌందర్య ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పార్టీ డివిజన్ అధ్యక్షురాలిగా నియమించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ.. అడ్డగుట్ట డివిజన్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లోని బీజేపీ నాయకులందరి సహకారంతో పార్టీ పటిష్టతకు పాటుపడతానన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బీజేపీ నాయకుడు హంసరాజు,ఎల్లం వీరేశం, శ్రావణ్, మోహన్, ఉదయ్, ప్రసాద్,మహిళా నాయకురాళ్లు లక్ష్మి, రాములమ్మ, గీత, కల్యాణి, విజయలక్ష్మి ఉన్నారు.



లేన్ క్రమశిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు, వలంటీర్లు

వాహనదారులు లేన్ క్రమశిక్షణ పాటించాలి: ఏసీపీ

రెజిమెంటల్‌బజార్,జనవరి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర, త్రిచక్ర వాహదారులు ఎడమ వైపు, ఫోర్ వీలర్స్ నడిపే వారు కుడి వైపున వెళ్లాలని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఆదివారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులో లేన్ క్రమశిక్షణపై ట్రాఫిక్ పోలీసులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ, ఫోర్ వీలర్స్ నడిపే వారు ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేస్తూ ద్విచక్ర వాహనాదారులకు ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు, ట్రాఫిక్ వలంటీర్లు శైలేష్, సుమతి, నరేష్ , లోకేంద్ర సింగ్, హర్ష, చంద్రశేఖరన్, భాస్కర్, అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.



సైబర్ క్రైమ్ ఏసీపీకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత తదితరులు

కేసీఆర్‌పై అసత్య ప్రచారాన్ని అరికట్టాలి

చిలకలగూడ, జనవరి19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావుపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాన్ని అరికట్టాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సైబర్‌క్రైమ్ ఏసీపీ శ్రీకాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వస్తున్న తీవ్ర వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సోషల్ మీడియా ద్వారా కేసీఆర్‌పై అసత్య ప్రచారం , వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ సోషల్ మీడియా అకౌంట్లపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఏసీపీకి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు కీర్తిలతా రెడ్డి, సుశీలారెడ్డి, మంజుల ఉన్నారు.



సీపీఆర్‌పై శిక్షణ తీసుకుంటున్న డిగ్రీ విద్యార్థులు

'గాంధీ'లో సీపీఆర్‌పై శిక్షణ

అడ్డగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడంపై ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని గాంధీ అలుమినీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. అలుమినీ అసోసియేషన్, జనహిత సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గాంధీలోని అలుమినీ భవనంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు స్కాట్, ఆర్మీ డిగ్రీ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. అకస్మాత్తుగా వచ్చే గుండెపోటు ప్రాణంపైకి తెస్తుందని, గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ ద్వారా సపర్యలు చేస్తే బతికే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, గాంధీ మెడికల్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఇందిర, డాక్టర్ లింగమూర్తితో పాటు వైద్యులు ఇంటర్నేషనల్ శిక్షణా సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రవీందర్, రాజశేఖర్, మూర్తి, మహేశ్వర్ రెడ్డి, అమెరికా హార్ట్ అసోసియేషన్ ఇన్‌చార్జి డాక్టర్ డెనీస్ మెకాలే (చికాగో), జనహిత సేవా ట్రస్ట్ నిర్వాహకులు నర్సింహ మూరి పాల్గొన్నారు.

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో రైల్వేలో భద్రత పటిష్టం

- ప్రయాణికుల రక్షణ, ప్రమాదాల నివారణకు పెద్దపీట
- అందుబాటులోకి 'బయో మెట్రిక్ ఆధారిత' సేవలు
- బాలల అక్రమ రవాణా అడ్డుకట్టకు చర్యలు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు



రైల్వే స్టేషన్‌లో చిన్నారిని చేరదీసిన ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ (ఫైల్)



రైల్వే ట్రాక్ వద్ద జరిగే ప్రమాదాలను గుర్తించే అలారం యంత్రాలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో భద్రతను ఆధునీకరించడం ద్వారా సంచలనాత్మక డిజిటల్ పరివర్తన ప్రయాణాన్ని ప్రారంభించిందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో తెలిపిన వివరాల ప్రకారం... ఆర్పీఎఫ్‌ను మెరుగుపరచడానికి బిగ్ డేటా అనలిటిక్స్ బయో మెట్రిక్ ఆధారిత సేవల్ని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా రైల్ మదద్ మేరీ సహేలీ వంటి ప్రయాణికుల కేంద్రీకృత యాప్‌లు రూపొందించింది. టికెట్ టూటింగ్, మానవ అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు ప్రబల్ వంటి డేటాను ఉపయోగిస్తోంది. ఆర్పీఎఫ్ ఆపరేషన్ 'నన్హే ఫరిశ్తే' కింద 84 వేల మంది పిల్లలను రక్షించింది. బాలల అక్రమ రవాణా చేస్తున్న ముఠా సూత్రధారిని ఆర్పీఎఫ్ పోలీసులు తన శైలిలో పట్టుకోగలిగింది. 2030 నాటికి అత్యంత సురక్షితమైన అధునాతన రైలు నెట్ వర్క్‌ను రూపొందించాన్ని ఆర్పీఎఫ్ లక్ష్యంగా పెట్టుకుంది.

భద్రత పెంపు..

రైల్వేలో నేరాల నియంత్రించడంలో ఆర్పీఎఫ్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. అధునాతన సాంకేతిక పరికరాలను వినియోగించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ఆర్పీఎఫ్ డైరెక్టర్ మనోజ్ యాదవ్ ప్రవేశపెట్టిన కొత్త టెక్నాలజీని వినియోగిస్తూ రైల్వేలో నేరాల నియంత్రణకు ఆర్పీఎఫ్ మరింత అప్రమత్తతో విధులు నిర్వహిస్తోంది. బయో మెట్రిక్ ఆధారిత సేవల ద్వారా ఏ రైలు ఎక్కడ ఉంది, ఏ రైలులో ఏం జరుగుతున్నది అనేది ఆర్పీఎఫ్ తెలుసుకొని ప్రయాణికుల భద్రత విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటోంది. అలాగే, రైల్వే ట్రాక్ వద్ద జరిగే ప్రమాదాలను నియంత్రించేందుకు డిజిటల్ జోనల్ అలారం సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను సైబర్ సెల్ ద్వారా కమాండెంట్ కంట్రోల్ రూమ్‌ను ఆర్పీఎఫ్ 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో బాలలు, బాలకార్మికులు కనిపిస్తే వెంటనే ప్లాట్ ఫాంలపై విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను అప్రమత్తం చేస్తున్నారు. సదరు బాలలను కానిస్టేబుళ్లు చేరదీసి సంరక్షణ గృహాలకు తరలిస్తున్నారు.

అన్నానగర్‌లో తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పైపులైన్ పనుల భూమిపూజలో పాల్గొన్న రామకృష్ణ

సికింద్రాబాద్, జనవరి19(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ రెండో వార్డు అన్నానగర్‌లో ఆదివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మంచినీటి పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తాను నిర్వహించిన బస్తీబాటలో బస్తీవాసులు తమ సమస్యను తెలియజేశారని, దాని పరిష్కారానికి నేడు పనులు మొదలు పెట్టామన్నారు. అలాగే కంటోన్మెంట్ ప్రాంతంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తర్వితగతిన పరిష్కరించేందుక కృషి చేస్తామన్నారు. కంటోన్మెంట్ ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా సహకారం అందివ్వకపోయినా కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒకట్రెడుసార్లు ఆలోచించి ప్రజల అభీష్టం మేరకు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు 2 బీజేపీ అధ్యక్షుడు మదారపు అశోక్, నాయకులు హర్షవర్ధన్, రమేష్, మమత, యాదవ్, రేఖా, కిషోర్, సతీష్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



బ్లాక్ బెల్టు సాధించిన విద్యార్థులతో ఏసీపీ రమేష్, సీఐ నాగరాజు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: ఏసీపీ

తిరుమలగిరి, జనవరి19(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు విద్యార్థుల మేధా సంపత్తితో పాటు శరీర దారుఢ్యాన్ని పెంచుతాయని ఏసీపీ రమేష్ అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని సూచించారు. తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని కాంబాట్ తైక్వాండో స్పోర్ట్స్ అకాడమీలో బ్లాక్ బెల్టు సాధించిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, కాంబాట్ తైక్వాండో, స్పోర్ట్స్ అకాడమీలో ఎందరో విద్యార్థులు బ్లాక్ బెల్టు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రధాన కోచ్ పి. నర్సింహను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలి: డీబీఎఫ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద జ్ఞానమాల వేసిన డీబీఎఫ్ మహిళా నాయకులు

బౌద్ధనగర్, జనవరి19(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహానికి తొమ్మిదవ వారం జ్ఞానమాలను వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ, కులగణన సర్వేను ప్రామాణికంగా తీసుకుని మాత్రమే రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించటం సరైనదికాదన్నారు. మీసేవలో, ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాబితాలో సొంత ఇళ్లు ఉన్న వారి పేర్లే వచ్చాయన్నారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు వెంకటమ్మ, కవిత, పరమేశ్వరి, రమ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ తదితరులు

1 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ఓయూలోని హెచ్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ కుమార్ తెలిపారు. క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆదివారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిషోర్ కుమార్ చేతుల మీదుగా బీఆర్ఎస్వీ నాయకులు ఆదివారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా నాగారం ప్రశాంత్ మాట్లాడుతూ, వచ్చేనెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు నిర్వహించే ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 29 వరకు 9848178925, 9346714365 ఫోన్ నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మొదటి బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, నాగయ్య, పవన్, మిథున్ ప్రసాద్, కొండ రామకృష్ణ, శ్రీకాంత్, వడ్డెపల్లి సందీప్, సాయి, అనిల్, నవీన్, శివ, ప్రేమ్ కుమార్, ఉదయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'వెయ్యి గొంతులు..' ప్రదర్శనను విజయవంతం చేయాలి

● దళిత జాతీయ కళామండలి నేత మాస్టర్‌జీ



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ జీ

తిరుమలగిరి, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'వెయ్యి గొంతులు, లక్ష డప్పుల' ప్రదర్శనను విజయవంతం చేయాలని దళిత జాతీయ కళామండలి అధ్యక్షుడు మాస్టర్‌జీ కోరారు. ఆదివారం బొల్లారం ఆదర్శ్ నగర్‌లో కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు దుబ్బ మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన వేల గొంతులు.. లక్ష డప్పులు సన్నాహక సమావేశంలో మాస్టర్‌జీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 30 ఏళ్లగా మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఫిబ్రవరిలో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమానికి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళలు, యువతీ యువకులు భారీ ఎత్తున తరలివచ్చి తమ పోరాట ప్రతిమను ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో సీఎల్ యాదగిరి, పరశురాం, టీడీపీ నాయకులు జనగామ నర్సింగరావు, కేపీ శ్రీనివాస్, అశోక్ అలియాస్ నర్సింగరావు, ఉమేష్, నవీన్, చిన్నా, సుధాకర్, బాలకృష్ణ, ఈఆర్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి: ఏపూరి

అడ్డగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫిబ్రవరి 7న నిర్వహించే 'వెయ్యి గొంతులు, లక్షల డప్పులు' ప్రదర్శనను విజయవం చేయాలని కోరుతూ కళాకారుడు, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న ఆదివారం అడ్డగుట్టలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ కళామండలి జాతీయ అధ్యక్షుడు అశోక్ , జిల్లా రథయాత్ర మహంకాళి శ్రావణ్, జిల్లా ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి విజయ్, జాతీయ నాయకురాలు భూపతి సుజాత, మహేష్, కారంపొడి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు కాలనీలోని సమస్యలను వివరిస్తున్న మహిళలు

నీటి సమస్యను నివారించండి.. స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించండి

● ఎమ్మెల్యేకు రెడ్డి కాంపౌండ్‌వాసుల వినతి

బోయిన్‌పల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు పరిధిలోని రెడ్డి కాంపౌండ్‌లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ కాలనీలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలని, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ కాలనీలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని, అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దె కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు, లేదా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాలనీ మహిళలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ, స్థానికంగా ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని, వీలైనంత త్వరగా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, అజయ్ ముదిరాజ్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

దొంగల కోసం ముమ్మరంగా గాలింపు

తిరుమలగిరి, జనవరి19 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారు జామున వస్త్ర దుకాణంలో చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకోవడానికి తిరుమలగిరి పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. కార్ఖానా డివిజన్ ఏసీపీ ఆధ్వర్యంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు నేతృత్వంలో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పాత నేరస్తులను సైతం విచారిస్తున్నారు. ముసుగు ధరించిన ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ముగ్గురూ ఒకే బైకు మీద ముషీరాబాద్ వరకు ప్రయాణం చేసినట్లు ధ్రువీకరించారు. చోరీకి పాల్పడింది అంతర్రాష్ట్ర దొంగల ముఠానా? లేదా లోకల్ దొంగాలా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే దొంగలు ఒకే బైకు మీద ముషీరాబాద్ వరకు ప్రయాణం చేసి అక్కడి నుంచి ఎటు వెళ్లారనేది గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

కాగా, వీరు అంతర్రాష్ట దొంగలైతే నాంపల్లి స్టేషన్ లేదా కాచిగుడ రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. దొంగలు వాడిన బైకు స్థానికులదేనని పోలీసులు నిర్ధారించినట్టు విశ్వసనీయం సమాచారం. కాగా, ఇలాంటి దొంగతనాలు సైబరాబాద్ లో కూడా జరిగిన నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులను సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు వేగవంతం చేశారు. రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకొనేందుకు వివిధ కోణాల్లో దర్యాప్తును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల్లోనే ఉంటా

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఢీఎస్ఎం కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా తమ కాలనీలోని రోడ్లపై తెల్లవారుజాము వరకు ఆకతాయిలు తిష్ట వేస్తున్నారని, బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన తలసాని రాత్రి వేళల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులును ఆదేశించారు. కాలనీలో ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ లైన్‌ను తొలగించాలని, విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న వైర్లను తొలగించాలని స్థానికులు కోరారు. మసీద్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో ఘననీయమైన అభివృద్ధి జరిగిందన్నారు.2014కు ముందు సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ ఫ్లైఓవర్ విస్తరణ, ఇండస్ట్రియల్ పార్క్ నుంచి బాలానగర్ వరకు అండర్‌పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయట్లేదని విమర్శించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, జీహెచ్ఎంసీ డీఈ వాసుదేవరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఏఈ శేఖర్, ఏఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ అధికారి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగడ్డ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ చెస్ట్ ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ అధికారిని నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 లోపు దరఖాస్తులు అందించాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.72 వేల గౌరవ వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వెల్లడించారు.